# వల్లెమబ్బుల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మకతలు

## వాగిమన్న

అరుగుమీన కూసోని పండు తాటికాయిలకి చెక్కలు కోస్తా వుంది మా జేజెమ్మ. తాటి పండు సందెపొద్దు మాదిరి ఎఱ్ఱంగా నిగనిగలాడతా ఘుమాయిస్తా వుంది.

నేను గుండెల్నిండా గాలి పీలుసుకుంటా ఆ యరుగు మీన్నే కూసున్నా!

"యాందయ్యో! ఎండ్లూరి వుల్లమ్మ యియ్యాల తాటిసెక్కలు వుడకేసద్ది గావాల!" అంటా వచ్చినాడు మా వూర్లో వుండే వొక తాత

మా జేజెమ్మ యడం చేతికి తెల్లగుడ్డతో కట్టు గట్టుకోమండది. వొకటిన్నర సేత్తోటే తిప్పలు బడతా తాటిసెక్కలు గోస్తా వుండది. ఆమికి దెబ్బయ్యేల్లుంయి. మనిసి మాత్తరం ఆరోగ్గెంగ వుండది.

"జేజెమ్మా! ఇవ్వటోల్లయితే నీ వొగిసుకి యాల బడిపోదురు. నువ్వు పాతకాలవు దానివి గాబట్టి గెట్టిగుండావు. అవ్వటిది మంచి తిండి గదూ!" అన్నా నేను.

తాత నా పెక్కనే కూసోని "ఆరోజులు రావులే నాయినా! అవ్వట్లో రూపాయికి ఆరు మానికల గింజలొస్తుండేది. ఇవ్వడు మానికే ఆఱ్రూపాయ లయ్యె. యాం దినేది? యాంక కొనేది?" అంటా వున్నడు.

ఇంగ మా జేజెమ్మందుకోని "మనిసి వుటక యెత్తినాలముంచి తిండికోసరం గింజాలాడుకోటవే సరిపోయ! యాం జేస్తమయ్యా! పొద్దుగూకులు ఆ పోరంబోకు పొలాల్లొబడి ఎంత శాకిరీ జేసినా సుక మేదుండది? వోనలు బడితే నాలుగు గింజలన్న రాల్తయ్యి గానీ, వోనలు బడితే గదా! ఎట్టి గొడ్డు

ఎండ్లూరి సుధాకర్.

మాదిరి ఆకాసం యెండి పోతా వుంది. మబ్బులకి పొదుగులు బడితే గదూ, పాల మాదిరి వోనలు నిండుకుండేది. అడివిలన్నీ నరకతా వుండరు. కొమ్మలు కొడతా వుండరు. యింగ యాన్నుం చొస్తయ్యి నీల్లు? బాలింతరాలికి పాలెండిపొయ్యిన మాదిరి మన బాయిల్లో నీల్లెండి పోతుండయ్యి. నీల్లు లేక అల్లాడి పోయినం తంఢ్రా!




ఆనాములుగానీ, గవురమెంటోల్లు గానీ మన గూడేల తట్టు కన్నెత్తి జూస్తుండరా! మనల్ని జూస్తే వోట్లుగా నొస్తయ్యి గానీ మన మొకాలు గానొ స్తయ్యా వోల్లకి? అవ్వడు మాత్తరం తెల్లటోపీలు బెట్టుకోని మన గూడేలకి వొస్తరు. యాడున్న పేమంతా వొలకబోస్తా పలకరిచ్చుకుంటరు. రెడ్డి గోరేమీ, నాయుడు గోరేమీ, ఎంత తియ్యంగ పలకరిస్తని? 'యాం వుల్లత్తో నీ వోటు నాకే యెయ్యాల!, వుల్లమ్మ గోరో! నా మీన దయ జూడాల!' ' అంటరు.




ఇంగ మన వూరి సరపంచయితే మన అరుగు మీనే కూసోని యాందో తియ్యంగ రాజ కతలు సెబతా వుంటడు. యాందయ్యా, ఈ నీతి? మనం దారి కాడ కానొచ్చినా, కస్టమొచ్చి చేతులెత్తి దండం బెట్టినా సీదరమొగం బెట్టి దులపరిచ్చుకోనిబోతరే!

వోటు గావాలన్నప్పుడు మాత్తరం బో జాలి జూపిస్తరు. యాందయ్యా యిది? అంటా పెద్ద గొంతేసుకోని అరస్తా వుండది.

"సరేలే జేజెమ్మ! యీ కత యెప్పుడూ వుండేదే గదా! ఆ యేసం దెచ్చుకోని నీ పానం పాడుజేసుకో బాక" అన్నా.

"యాం లేదులేయ్యా! నేనెప్పుడూ వొకర్తో తగునాడ బోను. జగడానికి బోను. యాదో ఆరోగ్గం యింత మాత్తరంగా వండది. నా ఆరోగ్గం యింతే బంగారు తండ్రా!

కట్టెలు గొడతా వుంటే సెయ్యిరిగే! ఈ కట్టుకి పామూరు బోవాల. కోడిగుడ్డూ –తెల్లజెనా, నెయ్యి, బెల్లం బాగా నూరి. ఆవనే కట్టుగడితే సెయ్యతుక్కుంటది. మాలోల్ల గురయ్య కట్టుగడతడు. యాదో రోజులు గడిసిపోతా వుండయ్యి.

పెద్దోల్ల దాస్టికాలు గేపకానికొస్తే ఇట్ట అరుసుకునేది. ఆవేక గమ్మునుండేది. "సేతులు దిప్పతా అంటా వుంటే · తాత పెద్దంగా నవ్వినాడు.

'యాందమ్మే వుల్లమా! గాందీ గోరి సెల్లెలు మాదిరి మాట్టాడతుండావు?' అనన్నడు.

"యాందయ్యా! సెల్లెలు గాకుంటే మాట్టాడగోడదా? గాందీ తాత సీవరగట్ట బట్టుకోని యీదులు జిమ్మిండని మంతిరయ్య మీటింగంలో జెబితే మనోల్లంతా తప్పెట్ల మాదిరి సపట్లు గొట్టిరి. అసలి మన కుర్రనా బట్టలకి బుద్దుండ బల్లే? పొంగలు గార్సుకుంటా మంతిరయ్యల సుట్టూ తిరుగుతరు "యానాడన్నా వోల్లని నిలదీసిన్రా?" అన్నది జేజెమ్మ.

"పెద్దోల్లని బట్టుకోని యాం నిలదీస్తరు. బో మాట్లాడతుండావు గదంటమే! అన్నడు తాత.

"యామి? గాందీ తాత గురించి గొప్ప జెబుతరే! ఆయన అరిజిన వాడలు వూడిసి, దొడ్లు గడిగిండన్నరే? ఆ మంతురుల్ని వొకపాలి మన గూడేలకి రమ్మనండి. మాకు దొడ్లే లేవు. ఇంకెం కడగతరు? మా గొడ్లు గడిగి మా సందులు జిమ్మమనండి.

మన గిన్నిల్లో మనతో బాటే యింత సంగటి దిని పొమ్మనండి. సల్లంగ గానక సెట్ల కింద మంచాలేసుకోని పొమకోమనండి. మన గుడిసిల్ని, చింకిపొయ్యిన కవ్వల్ని సూడమనండి. వాల్ల యిల్లని జూసుకోమనండి. ఇంగ వోల్లే దరమ పెబువులు. నాయం జెప్పమనండి. నాలుగు రోజులు మేం వోల్ల మిద్దెల్లో కాపరముంటాము. వోల్లని మన గుడిసెల్లో వుండమనండి.

ఎందుకు వోల్ల మాటలు నమ్మి మోసబొయ్యేది? గాందీ తాత సీవరగట్ట బడితే మా పొట్ట నిండిందా? ఆయిన అరిజనుల్ని బిలిస్తే మాకేమన్నా పీటలేసి కూకోబెట్టిండ్రా?

సచ్చి యాడున్నడో గాందెయ్య! మనోల్లమీన శానా జాలి జూపిచ్చే వోడంటవే? అట్టయితే మనోల్లని వూరికి ఆసింట బెట్టిన సంగతి ఆ పెద్దాయినకి బాగా తెలుసుగావాల్నే? వూరు వూరంతా వొకటి గావాలని, అందురూ అరిజన్లే అని ఆయిన జగడం బెట్టి పోరాటం ఎందుకు జెయ్యలా? మరి పెద్ద కులపోల్ల మీన, పంతుల్ల మీన కోపం జేసి, యాందిరా మీరు జేసేదీ అని వోల్లమీన అలిగి కూడు నీల్లు లేకుండా మూతి బిగిచ్చుకోని కూసోవొచ్చు గదా?

ఓ యమ్మా! ముసిలాయని బోతడు గావాల అని జవాలు బుద్ది దెచ్చుకోని మనుసు మార్సుకోనుందురేమో గదయ్యా!

యాంది ముసిలాయనా మాట్లాడవూ?" అని వొక్క గెదుము గదిమింది మా జేజెమ్మ.

ఇంగ మా తాత నీల్లు నమల్తా గమ్మునుండాడు. రొంచేపైనంక ఇట్టన్నడు.

"మే వుల్లమ్మా! ఎట్టయితేనేమి? నీ మనవడు చెంగడు పట్నంలో పెద్ద సదువు సదవతుండ్లా?"

"మన అంబేత్కరయ్య వుండబట్టి మన రోజులు బాగుపడ్డయ్యి. ఆ అయ్యే వుట్టకుంటే మన వుటకలకి వుట్టగతులుంటయ్యా తండ్రా!

యాదో మనోల్ల కాడ నోరెత్తి కుడవులో బాదంతా యెల్ల బోసుకునేది. లేకుంటే నోరు మూసుకునేది. అదే బయటోల్లకాడ యియ్యన్నీ జెప్పకుంటమా? నాకేం దెలియదు. నేను మూగి దున్నని!"

మా జేజెమ్మ మాటలాపంగనే మా మాత పగలబడి నవ్వి

"అవునమ్మే! నువ్వు మూగిదున్ననే! పాపం మాటలే రావు" అంటా సెమత్కారం జేసి అన్నుంచి లేసి యింటి దారి బట్టిండు.




మీ వెనుక రకరకాల పేర్లతో మిమ్మల్ని ఆటపట్టిస్తున్నారా!



సక్రమ చర్య చేపట్టేందుకు ఇదే మీకు సరియైన సమయం

**ఫార్మాలిన్:** స్థిరమైన, ఖచ్చితమైన, సురక్షితమైన బరువును కలిగియుండేందుకు మీకు సహాయపడే దివ్యౌషధముగా నిరూపించబడింది. మీరు నాజూకూ, సహజ సౌకుమార్యంతో విరాజిల్లుతారు.

NO EXERCISE
DIETING
SIDE EFFECTS

Pharmalin
CAPSULES
సంపూర్ణ ఆయుర్వేద ఔషధం

అన్ని మందుల & జనరల్ స్టోర్సులలోనూ లభించును

Pharmaids

స్టాకిస్టులు: ■పారస్ ఏజెన్సీస్, హైదరాబాద్, ఫోన్: 515473 ■ శ్రీ గాయత్రి మెడికల్ ఏజెన్సీస్, నెల్లూరు, ఫోన్: 23971 ■ విశ్వశాంతి ఫార్మా, నల్గొండ ■ శ్రీ సాయి ఫార్మా, తిరుపతి, ఫోన్: 2302 ■ శ్రీ వెంకటాద్రి ట్రేడర్స్, మదనపల్లి, ఫోన్: 63605

Aneja /PPL/P2/96